క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

చౌడేపల్లి: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధి చేశారు. రాహుకాల సమయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వేదపండితులు అమ్మవారికి అభిషేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా ముస్తాబు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి పూజల్లో పాల్గొనేందుకు అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈఓ చంద్రమౌళి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఆలయ అభివృద్ధికి మంత్రి పెద్దిరెడ్డి విరాళం


నగదును అందజేస్తున్న ఎంపీపీ ఈశ్వరయ్య

సోమల: మండలంలోని తమ్మినాయనిపల్లె పంచాయతీ పేగలవారిపల్లెలో ఉన్న అమృతేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రూ.2 లక్షల విరాళం అందజేశారు. ఈ నగదును శుక్రవారం ఎంపీపీ ఈశ్వరయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంగాధరం చేతుల మీదుగా స్థానిక సర్పంచ్ సురేంద్రరెడ్డికి అందజేశారు. అలాగే పేగలవారిపల్లె గ్రామానికి మంత్రి చొరవతో జెడ్పీ నిధులు రూ.5 లక్షలతో కొత్తబోరు మంజూరైనట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు ప్రభాకర, సయ్యద్‌బాషా పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ


సమీక్షిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పెద్దపంజాణి: స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం హౌసింగ్, వెలుగు, ఉపాధి హామీ పథకాలపై సమీక్షించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.రెడ్డెప్ప, ఎంపీటీసీ గురుమూర్తి, హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్ రెడ్డి, ఏపీఎం క్రిష్ణప్ప, ఏపీఓ చిన్న రెడ్డెమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు నాగశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'గురుకుల'కు 35 మంది ఎంపిక

బైరెడ్డిపల్లి: మండలంలోని వివిధ గ్రామాల నుంచి కమ్మనపల్లె గురుకుల పాఠశాలకు 35 మంది విద్యార్థినులు ఎంపికైనట్లు ఎంఈఓ సాయిలీల తెలిపారు. పేద విద్యార్థులకు గురుకుల పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందుతుందన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

సదుం: స్థానిక మహాత్మా జ్యోతీబా పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలకు జూనియర్ కళాశాల మంజూరు అయినట్టు ప్రిన్సిపల్ శ్రీనివాసులు రెడ్డి శుక్రవారం తెలిపారు. ఎంపీసీ, బైపీసీలో 20 సీట్ల భర్తీకి మెరిట్ ప్రాతిపదికన దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆయన చెప్పారు. వివరాలకు 9059494307 నంబరులో సంప్రదించాలని కోరారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



శాంతిపురం: తహసీల్దార్‌గా ఏ.నరసింహులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పుంగనూరులో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆయన ఉద్యోగోన్నతిపై ఇక్కడికి బదిలీ అయ్యారు. ఇంతకు ముందు ఇక్కడ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా డిటీ కొలేష్ బాధ్యతలు నిర్వర్తించారు. నూతన తహసీల్దార్‌ను రెవెన్యూ సిబ్బంది సత్కరించారు.

బైరెడ్డిపల్లెలో..



బైరెడ్డిపల్లి: తహసీల్దార్ కుమారస్వామిని శుక్రవారం రెవిన్యూ సిబ్బంది సత్కరించారు. ఇక్కడ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆయన ఉద్యోగోన్నతి పొంది తహసీల్దార్ కావడంతో ఉద్యోగులు ఆత్మీయ సన్మానం చేశారు.

గాయపడిన వ్యక్తి మృతి

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందినట్లు కల్లూరు ఎస్‌ఐ రవిప్రకాష్ రెడ్డి తెలిపారు. వివరాలు.. రొంపిచెర్ల నుంచి పులిచెర్లకు వస్తున్న ఆటోను, పులిచెర్ల నుంచి రొంపిచెర్ల వైపు వెళ్తున్న ఓ కారు పులిచెర్ల సమీపంలోకి రాగానే ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న పాకాల మండలం ఇ.పాలగుట్టపల్లెకు చెందిన మునిరెడ్డి(62) తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పలమనేరు బాలికోన్నత పాఠశాలలో తమ పిల్లలకు ఆరో తరగతి అడ్మిషన్ల కోసం క్యూకట్టిన తల్లిదండ్రులు



ప్రభుత్వ స్కూళ్లకు జైజై..!

పలమనేరు నియోజకవర్గంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఆరోతరగతి అడ్మిషన్లకు గతంలో ఎన్నడూ లేనంతగా ఈ పర్యాయం డిమాండ్ ఉంటోంది. ఇప్పటి వరకూ ప్రైవేటు స్కూళ్లలో చదివించిన తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను ప్రభుత్వ స్కూళ్లలో చేర్పేందుకు తాపత్రయ పడుతున్నారు. నాడు–నేడుతో వసతులు, సౌకర్యాల పరంగా స్కూళ్ల రూపురేఖలు కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా ఉండటం ..పాఠశాలల పునఃప్రారంభం రోజునే విద్యాసామగ్రి ఇవ్వడం..అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యణా ప్రమాణాల బోధన ప్రధానంగా తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నాయి.

– పలమనేరు

- అడ్మిషన్లకు ఫుల్ డిమాండ్
- ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో అడ్మిషన్లకు క్యూ
- టెన్త్ పరీక్షల్లో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలలపై మరింత ఆసక్తి
- విద్యార్థుల తల్లిదండ్రులను ఆకర్షిస్తున్న స్కూళ్ల సౌకర్యాలు, నాణ్యమైన విద్యాబోధన


పదిలో ఉత్తమ ఫలితాలను సాధించిన పలమనేరు బాలికోన్నత పాఠశాల

బాలికోన్నత పాఠశాలే ఇందుకు సాక్ష్యం

స్థానిక బాలికోన్నత హైస్కూలులో ఏటా 900మంది వరకు 6 నుంచి 10వ తరగతుల్లో విద్యార్థులుంటారు. 2022–23లో మొత్తం 938 మొత్తం విద్యార్థులుండగా, 2023–24లో ఇప్పటిదాకా 961కి చేరింది. ఈసారి ఆరో తరగతిలో కొత్త అడ్మిషన్లు 157 అయ్యాయి. మరో 20మందికి మాత్రమే అవకాశం ఉంది. ఆపై ఇక్కడ నో అడ్మిషన్ బోర్డును పెట్టడం ఖాయంగా కనిపిస్తోంది. ఈపరిస్థితి ఇక్కడే కాదు.. పట్టణంలోని బాలుర హైస్కూల్, ఉర్దూ హైస్కూల్, బైరెడ్డిపల్లె మండలంలోని బాలికలు, బాలుర ఉన్నత పాఠశాలలు, లక్కనపల్లె, తీర్థం, కడపనత్తం, నెల్లిపట్ల, వీ.కోట మండలంలోని పది ఉన్నత పాఠశాలలు, గంగవరంలోని ఏడు హైస్కూళ్లు, పెద్దపంజాణిలోని పది పాఠశాలల్లో గత ఏడాది కంటే ఈసారి అడ్మిషన్లు గణనీయంగా పెరిగాయి.

పది పబ్లిక్ పరీక్షల్లో సత్తా చాటిన సర్కారు బడులు

పలమనేరు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు టెన్త్ ఫలితాల్లో సత్తాచాటాయి. ప్రైవేటు స్కూళ్లకుదీటుగా ఉత్తమ ఫలితాలను సాధించాయి. మండలంలోని మండిపేటకోటూరు, బాలికోన్నత పాఠశాల, నక్కపల్లి, దొడ్డిపల్లె, కొలమాసనపల్లె పాఠశాలల సైతం ఈసారి 70 శాతం పైగా ఉత్తీర్ణత సాధించాయి. స్థానిక బాలికోన్నత పాఠశాలలో 40 మంది 500 పైచిలుకు మార్కులు సాధించారు. బైరెడ్డిపల్లె మండల కేంద్రంలోని జెడ్పీ హెచ్‌ఎస్ ఉర్దూ స్కూల్ 94.44శాతం ఉత్తీర్ణతతో సత్తా చాటింది. గంగవరం మండలంలో మేలుమాయి 92శాతంతో టాప్‌లో నిలిచింది. పెద్దపంజాణి మండలంలో రాజుపల్లె 92శాతంతో మండలంలో తొలిస్థానం సాధించింది. వీకోట మండలంలో కొంగాటం స్కూల్ 92 శాతం సాధించింది.

భారీగా పెరిగిన అడ్మిషన్లు



గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పేందుకు తల్లిదండ్రులు పోటీ పడుతున్నారు. ఇందుకు ప్రధాన కారణం ఇటీవల టెన్త్ ఫలితాల్లో మంచి మార్కులు రావడం, నాణ్యమైన విద్యాప్రమాణాలకు తోడు ప్రధానంగా నాడు–నేడుతో స్కూళ్ల తీరుతెన్నులు మారడమేనని చెప్పవచ్చు. ఫలితంగా ఆరో క్లాస్‌లో అడ్మిషన్లు రెట్టింపుగా ఉన్నాయి. ఈపర్యాయం అదనపు సెక్షన్లను పెట్టాల్సిన పరిస్థితి కలుగుతోంది.

– లీలారాణి, ఎంఈఓ, పలమనేరు

'నో అడ్మిషన్' బోర్డు పెట్టే పరిస్థితి



సాధారణంగా వెవెయ్యి మంది పిల్లలున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు తక్కువగా ఉంటాయి. కానీ పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఏటా విద్యార్థుల సంఖ్య 900 కన్నా పైమాటే. ఈ సారి ఇక్కడ పరిస్థితి చూస్తుంటే ఈ సంఖ్య వెయ్యి దాటేలా ఉంది. దీంతో నో అడ్మిషన్ బోర్డు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది.

– సుబ్రమణ్యం రెడ్డి, హెచ్‌ఎం, బాలికోన్నత పాఠశాల, పలమనేరు

ప్రైవేటు స్కూళ్లకు బై..బై..!



ప్రభుత్వ బడుల్లో ఠంచనుగా పాఠ్యపుస్తకాలు, పిల్లలకు జగనన్న విద్యాకానుక, పొద్దున రాగిజావ.. మధ్యాహ్న భోజనం, పిల్లల చదువు కోసం ఏటా అమ్మ ఒడి.. ఇలాంటివి ప్రభుత్వ బడుల్లో అమలు చేయడం ఫలితాలు ప్రైవేటు స్కూళ్లకంటే దీటుగా వస్తున్నాయి. ఇలాంటప్పుడు సర్కారు బడులను కాదని ప్రైవేటు స్కూళ్లకు తల్లిదండ్రులు తమ పిల్లలను ఎందుకు పంపుతారు?

– భారతి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్, పలమనేరు

ఉజ్వల భవితకు సోపానం


ఆణిముత్యాల పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్సీ భరత్

కుప్పం: అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు ప్రభుత్వ పథకాలను ఉజ్వల భవితకు సోపానంగా చేసుకోవాలని ఎమ్మెల్సీ భరత్ పిలుపునిచ్చారు. పదవ తరగతి, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు శుక్రవారం జగనన్న ఆణిముత్యాల కార్యక్రమం పేరిట స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సన్మానించారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధించి ప్రభుత్వ స్కూళ్ల పేరుప్రతిష్టలు ఇనుమడింపజేశారని అభినందించారు. భవిష్యత్తులో విద్యార్థులు తమ లక్ష్యాలను అందుకుని ప్రభుత్వ పాఠశాలలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యారంగానికి పెద్దపీట వేసి, నాడు–నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చేశారని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అశ్విని, మున్సిపాల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, జెడ్పీటీసీ శరవణ, ఎంపీడీఓ జానకమ్మ, ఎంఈఓ మహ్మద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్సీ భరత్


బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ పునరుద్ఘాటించారు. మండలంలోని కొంగనపల్లె పంచాయతీలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. సంక్షేమ పథకాల అమలు గురించి వివరించారు. అలాగే పథకాల లబ్ధి పొందిన వారికి బుక్‌లెట్‌తో వివరించారు. ఆయన మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. కుప్పం నియోజక వర్గంలో ప్రతి గ్రామంలోనూ సీసీ రోడ్లు వేయడాన్ని త్వరలో పూర్తి చేస్తామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని, తద్వారా అట్టడుగు, బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఆర్థికంగా, సామాజికంగా ముందుకెళ్తున్నారన్నారు. అన్ని రంగాలతోపాటు పారిశ్రామిక రంగం అభివృద్ధికి సైతం సీఎం ప్రత్యేక చొరవ చూపుతున్నారని పేర్కొన్నారు. తన దృష్టికి ప్రజలు నివేదించిన సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ కో–కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచ్ కళమ్మ, ఉప సర్పంచ్ సుబ్రమణ్యం, ఎంపీటీసీ సభ్యురాలు సౌందర్య, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు సుగుణప్ప, నేతలు అరవింద్, ప్రభాకర్ రెడ్డి, నాగరాజు, రాధాకృష్ణ, ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, మండల అధికారులు పాల్గొన్నారు.

విద్యాకానుక కిట్ల పంపిణీ


విద్యాకానుక కిట్లను పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

వి.కోట: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని సర్పంచ్ సుభాష్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని కుంభార్లపల్లె పంచాయతీలోని ఉన్నత పాఠశాల, ఉర్దూ పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థులకు పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ పాఠశాలలు మౌలిక వసతుల లేమితో కొట్టుమిట్టాడేవని, విద్యార్థులు, టీచర్లు ఇబ్బందులు పడేవారని పేర్కొన్నారు. ప్రస్తుతం సీఎం ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మౌలిక వసతులు కల్పించారన్నారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, లయన్స్ క్లబ్ మండల అధ్యక్షుడు సురేంద్రగౌడ్, ఎంపీటీసీ మురుగేష్, పంచాయతీ, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి


పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీపీ ఈశ్వరయ్య

సోమల: ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు అందజేస్తున్న భోజనంలో మెనూ తప్పక పాటించాలని ఎంపీపీ ఈశ్వరయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని ఎస్.నడింపల్లి పంచాయతీలోని సూరయ్యగారిపల్లె, కరకమంద, ఎస్.నడింపల్లె ప్రాథమిక స్కూళ్లను, అంగన్‌వాడీ కేంద్రాలను స్థానిక సర్పంచ్ వెంకటరమణతో కలిసి తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ప్రభాకర తదితరులు పాల్గొన్నారు.

పట్టు రైతులకు శిక్షణ


రైతులకు అవగాహన కల్పిస్తున్న పట్టుపరిశ్రమ అధికారులు

రామకుప్పం: మండలంలోని మణీంద్రం రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం 'ఆత్మ' ఆధ్వర్యంలో పట్టు రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పట్టు పరిశ్రమశాఖ సంయుక్త సంచాలకులు శోభారాణి మాట్లాడుతూ, రైతులు పట్టుపురుగులను అనుకూల వాతావరణంలో పెంచాలన్నారు. మల్బరీ మొక్కలు నాటడం, పట్టు పురుగుల పెంపకం, అధిక దిగుబడి పొందడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను దృశ్య మాధ్యమం ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఎస్ హనుమంతరాయ, శాస్త్రవేత్త వెంకటా చలపతి, మణీంద్రం సర్పంచ్ ఉషారాణి, వైస్ సర్పంచ్ గోపి, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత చంద్రమోహన్ రెడ్డి, ఆర్బీకే అధికారి జాస్మిన్, రైతులు పాల్గొన్నారు.

సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం తగదు

- సమావేశంలో సర్పంచ్ వరుణ్ భరత్
- మంత్రి పెద్దిరెడ్డి కుటుంబం వెంటే ఉంటాం


సర్పంచ్ వరుణ్ భరత్

చౌడేపల్లె: తాను టీడీపీలో తాను చేరుతున్నట్లు సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేయడం తగదని చౌడేపల్లె మేజరు పంచాయతీ సర్పంచ్ వరుణ్‌భరత్ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. టీడీపీలో చేరుతారని సామాజిక మాధ్యమాల్లో వచ్చిన కథనాన్ని ఆయన ఖండించారు. ఆయన మాట్లాడుతూ పుంగనూరు నియోజక వర్గాన్ని గతంలో ఎవరూ చేయని విధంగా అభివృద్ధి చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి వెంటే తామంతా నడుస్తామన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై మాజీ ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పుంగనూరులో పోటీ చేసినా అత్యధిక మెజారిటీతో మంత్రి పెద్దిరెడ్డి గెలుపు తథ్యమన్నారు. అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేసి లబ్ధి చేకూర్చుతూ, గ్రామాలను అభివృద్ధి చేస్తూ ప్రగతి పథంలో నడిపిస్తున్న ప్రభుత్వానికి, మంత్రి పెద్దిరెడ్డి కుటుంబానికి అండగా నిలుస్తామన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


కోగిలేరులో నిర్వహిస్తున్న వైద్య శిబిరం

పెద్దపంజాణి: మండలంలోని కోగిలేరులో శుక్రవారం పలమనేరు సాయిరామ్ ఆస్పత్రి, ఆర్ఎన్ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 160 మంది రోగులకు బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దళిత నాయకుడు చిన్నా జన్మ దినాన్ని పురస్కరించుకుని ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ రమేష్ బాబు చెప్పారు. కార్యక్రమంలో పీఎస్ గణపతి, వీఆర్వో సుధాకర్, ఆర్ఎన్ హెల్త్ కేర్ డాక్టర్ రవితేజ, ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ సిబ్బంది రామలక్ష్మి, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆణిముత్యాలకు పురస్కారాలు

గంగవరం: పదవ తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణులైన మండలంలోని కీలపట్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థినీ విద్యార్థులు చందు, జ్ఞానతేజ, జాహ్నవికి శుక్రవారం జగనన్న ఆణిముత్యాల పురస్కారాలను అందజేశారు. వరుసగా వీరికి రూ. 3వేలు, రూ. 2వేలు, రూ. వెయ్యి చొప్పున అందజేసి సన్మానించారు. అలాగే సైన్స్ ఉపాధ్యాయుడు తులసిరాం సైతం వీరికి రూ. 5 వేలు, రూ. 3 వేలు, రూ. 2 వేల చొప్పున అందజేసి అభినందించారు. ఎస్ఎంసీ మాజీ చైర్మన్ చంద్రబాబు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ శ్రీనివాసులు, హెచ్ఎం దామోదరం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె : పదోతరగతి పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ.3వేలు, రూ.2వేలు, రూ.వెయ్యి చొప్పున నగదు ప్రోత్సాహకాలను ఎంఈఓ సాయిలీల అందజేశారు. విద్యార్థులను సత్కరించారు. చదువుల్లో రాణిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

రామకుప్పంలో..

రామకుప్పం: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. 10వ తరగతిలో మంచి ఉత్తీర్ణత సాధించిన ఎంఎస్.దీపిక, రోషిణి, రిజియా, వైష్ణవిలకు నగదు పురస్కారాలతోపాటు పతకాలు, ప్రశంసా పత్రం అందజేసి సన్మానించారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన వారికి రూ.3000, రూ.2000,రూ.1000 నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్‌పర్సన్ రాజేశ్వరి, హెచ్ఎం జయశ్రీ, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు సత్కారం

పులిచెర్ల(కల్లూరు): పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు రాష్ట్రప్రభుత్వంఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా నగదు ప్రోత్సాహకాలు అందజేయడం సంతోషకరమని ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి అన్నారు. కల్లూరు జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం పదో తరగతిలో పరీక్షల్లో మొదటిస్థానం సాధించిన రెడ్డిప్రియకు రూ.3 వేలు, ద్వితీయస్థానంలో నిలిచిన కౌశియకు రూ.2 వేలు, తృతీయ స్థానంలోని నఫ్సిన్‌కు రూ.వెయ్యితో పాటు మెడల్స్, ప్రశంసాపత్రం ఇచ్చారు. ఎంఈఓ సిద్ధరామయ్య, సర్పంచ్‌లు షకూర్, నటరాజ, ఎంపీటీసీ రెడ్డి అహమ్మద్ ఎస్ఎంసీ చైర్మన్ రఫీ, రెడ్డిప్రకాష్, నాదమునిరెడ్డి, నరసింహులు శెట్టి, చంద్రశేఖర్‌రెడ్డి, గోవిందరెడ్డి, మునస్వామి, హెచ్ఎం శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.


రామకుప్పంలో..

సదుంలో..

సదుం: ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించడానికి తల్లిదండ్రులు మొగ్గు చూపుతున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తెలిపారు. స్థానిక ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాల్లో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన జైరాకేష్, హరీష్, రిత్విక్‌సాయి, రంజిత్‌కు ప్రశంసాపత్రాలు, నగదు ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీరాములు, ప్రిన్సిపల్ శ్రీనివాసులరెడ్డి, నాయకులు బాబురెడ్డి, ఇమ్రాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్తయిండ్లులో..

కుప్పం రూరల్: మండలంలోని కొత్తయిండ్లు ఉన్నత పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇక్కడ పదవ తరగతి టాపర్లుగా నిలిచిన ఆర్.సౌమ్యగౌడ, ఢిల్లీబాబు, అనురాధకు వరుసగా రూ.4,000, రూ.2,500, రూ.1,500 చొప్పున బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిగా సర్పంచ్ కుమారస్వామి మాట్లాడుతూ, జగనన్న సీఎం అయ్యాక ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ స్కూళ్లలోనే చేర్పించాలనే కృతనిశ్చయంతో ఉండటం ఆనందదాయకమన్నారు. ప్రధానోపాధ్యాయులు మోహన్‌సింగ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కుప్పంరూరల్ : కొత్తయిండ్లులో..


గంగవరం : విద్యార్థులకు ప్రదానం చేస్తున్న పురస్కారాలు


బైరెడ్డిపల్లె : విద్యార్థులను సత్కరిస్తున్న ఎంఈఓ సాయిలీల


కల్లూరు: విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి


సదుం: ప్రతిభ చూపిన విద్యార్థులతో పెద్దిరెడ్డి